# వారి సఖి

దీపాలు పెట్టేవేళ. ఆయన క్లబ్‌కి వెళ్ళారు. పేకాట వేసుకు కూచుని ఏ పదింటికో కాని రారు. వారు వచ్చేటప్పటికి నేరెండో యామంలో వుంటాను. ఆ చల్లారిపోయిన అన్నం కళ్ళు నులుపుకుంటూ పెట్టడం-ఆయన వంటకాలని వంకలు పెడ్తూ తినడం-యిది నిత్యమూ అలవాటే. ఓ సినిమాకిగాని- ఏ స్నేహితులింటికో గాని బీచికిగాని వెళ్ళడమంటే పండగే నన్నమాట. ఎక్కడికైనా వెళ్లాలి అంటే ఆయనకి మూడురోజులముందే అర్జీ పెట్టుకు- ప్రొద్దున్నా సాయింత్రం రాపాడిస్తే ప్రాణసమానమైన క్లబ్‌నీ-పేకనీ వదిలి నన్ను వుద్ధరిస్తున్నట్లు తీసుకెళ్తారు.

మావాళ్ళంతా మటుకు మాది ఆదర్శ దాంపత్యం అనుకుంటారు. ఎందుకంటే నే పుట్టింది పల్లెటూరు. ధైర్యంచేసి నన్ను మెట్రిక్ దాకా మావాళ్ళొక్కళ్ళే చదివించారు. అదీగాక మీవారు అందరి అల్లుళ్ళకి మల్లే ఆ చుట్టుపక్కల ఏ బడిపంతులో-కలక్టరాఫీసులో పనో చెయ్యక, ఆ ఎం. ఎ. డిగ్రీ చేత పుచ్చుకు, పట్నంలో ఆ డిగ్రీని విధిగా వుపయోగిస్తూ వుద్యోగం వెలిగిస్తున్నారాయను! ఇద్దరికీ ఇంగ్లీషు వచ్చు-అందుకని ఆదర్శ దాంపత్యం మావాళ్ళ దృష్టిలో.

రాత్రి వంట పూర్తిచేసి జడవేసుకుంటున్నాను. వీధిలో కారు హారన్ పదేపదే చప్పుడవుతోంది. ఇంతట్లో మా రాముబంటు అప్పన్న వచ్చి "అమ్మగారూ-ఎవరో పెద్దకార్లో మనింటి కొచ్చారమ్మా-అయ్యగారిని అడుగుతున్నారు" అన్నాడు.

అల్లుకునే జడని సగంలో వదిలి వీధిలోకి వెళ్ళాను. ఫోర్డుకారులో ఒకావిడా యిద్దరు పిల్లలూ. "సుబ్బారావు యిల్లు యిదేనా? యింట్లో వున్నాడా?" అని ఆవిడ ప్రశ్నించింది.

"లేరు" అంటూ స్వచ్ఛమైన హిందూ గృహిణిలా లోపలికి ఆహ్వానించాను. కాని మనసులో ఎవరా ఇంత స్వతంత్రంగా అడుగుతుందని ఆలోచిస్తున్నాను. మనిషి దబ్బపండులా వుంది. కొంచెం పొట్టి. అందువల్ల కాస్త లావుగా కనబడుతోంది. కట్టూ తీరూ చూస్తే చదువుకున్న వనితలా వుంది. పిల్లలిద్దరూ చిలకల్లా వున్నారు పంజాబీ డ్రస్సులో.

కూర్చున్నాం. అప్పన్న కుంపటి అంటించనా అన్నట్టు చూశాడు. అంటించమని సౌంజ్ఞ చేశాను. సంభాషణ ఎలా మొదలెట్టనా అని ఆలోచిస్తున్నాను. ఎంతో మాటకారి అని పేరుపడ్డ నేను ఈ అపరిచిత వ్యక్తిని సంభాషణలో దించేందుకు యిబ్బంది పడ్తున్నాను.

ఆవిడ యింటిని నాలుగుమూలలా పరకాయించి చూస్తోంది. ఆఖరికి సోఫా సెట్టూ రేడియో అన్నా లేని మా యిల్లు ఆవిడ కంటికి యింపుగా ఎలా తోస్తుంది? గోడకు వేలాడేసిన మా పెళ్ళి ఫోటోను తీక్షణంగా చూస్తోంది. మా పక్కింటావిడకు మల్లే దానికి పువ్వులహారం వెయ్యనందుకు నన్ను నేనే అభినందించుకున్నాను.

ఆ చంచలాక్షి తన దృష్టుల్ని నాపై మరల్చి "మాది బందరు. మీ వారు నేను క్లాస్ మేట్స్" అంటోంది.

నేను వెంటనే అందుకున్నాను. "అంటే మీ పేరు సుగుణకదూ? వారు ఎప్పుడూ చెపుతూ వుంటారు మిమ్మల్ని గురించి. పాపం ఇంట్లో లేరు" అన్నాను.

"మిమల్ని చూసేందుకే వచ్చాను. అనిల్ని ఎల్లాగా ఎరుగుదును. యిన్నాళ్ళనుంచి ఎడ్రసు తెలియక మదనపడ్తున్నాను. మొన్న మా ఇద్దరికి కామన్ ఫ్రెండ్ గిరీశం కనబడి, అడ్రసు యిచ్చాడు. మా కిక్కడికి ట్రాన్స్ఫర్ అయినట్టు మీ వారికి తెలియదూ!"

"అయిదేళ్ళక్రింద, అంటే మా పెళ్ళికి, మీ తమ్ముడొచ్చారుట. అంతే – అప్పటినుంచి మీసంగతులే తెలియడంలేదు. అప్పుడు మీరు కటకంలో వున్నట్టు చెప్పాను. ఈమధ్య మీ సంగతులు తెలియడంలేదు."

"మూడు నెల్లయింది యీవూరికి ట్రాన్స్ఫర్ ఐ. అప్పటినుంచి ప్రయత్నం మిమ్మల్ని కలుసుకోవాలని. ఇల్లు తెలిసిందిగా వస్తూపోతూ వుండచ్చు"

ఇంతకీ ఆవిడ భర్త గారి వుద్యోగమేమిటో నాకు తెలియదు. ఎల్లా అడగాలా అని అనుకుంటుంటే అప్పన్న "అమ్మగారూ!" అని వంటింట్లోంచి కేక పెట్టాడు. 'హిందూ' ఆవిడ ముందు వుంచి లోపలికెళ్ళి టీ తయారు చేశాను. పట్టుకొచ్చేవేళకి పిల్లలు 'వెళదాం' అని మారాం మొదలెట్టారు. టీ సేవించాక "మా అడ్రసు యిస్తాను. మీరూ సుబ్బారావూ రండి" అంది హాండ్ బాగ్ తెరుస్తూ.

"అల్లాగే" అన్నాను.

వారాయన విజిటింగ్ కార్డు యిచ్చింది. వెళ్తూ "తప్పకండా వస్తారుగా రేపు ఆదివారం ఆరింటికి" అంది. తల వూపాను.

మావారు నా పెళ్ళికి ముందు గ్రంథ సాంగులని ప్రతీతి పడ్డారు. అంత చిన్నతనంలోనే అన్ని గొడవల్లో పడ్డ కుర్రాడు పెళ్ళయాక అమ్మాయితో సరిగ్గా వుంటాడో లేదో అని మా అమ్మ జంకింది. స్కూల్ ఫైనల్ పాసయి బందరులో యింటరు చదువుకు వెళ్ళారు. ఆ యేడు సుగుణకూడా జూనియర్‌లో ప్రవేశించిందట. వీరిద్దరూ ముందు నోట్సులు మార్చుకోడంతో మొదలుబెట్టి, చివరికి చివరికి ప్రేమలో బుడుగూ బుడుగూ మునకలుదాకా వచ్చారట. సుగుణతండ్రి తాసిల్దారు. ఒక్కగాను ఒక్క అమ్మాయికి అల్లారు ముద్దుగా చదువు చెప్పిస్తుండేవాడు. కాలేజీ వార్షికోత్సవాల్లో సుగుణ నాట్యం, మావారి కవిత్వం తప్పకుండా వుండేవిట. లలిత కళల్లో ప్రవేశమున్న వీళ్ళిద్దరూ ప్రేమికులై ఊరుకున్నారట.

మూడేళ్ళు ప్రేమించుకుంటూనే యిద్దరూ బి. ఎ. లోకి వచ్చారు. ఈ లోపల మావారు కృష్ణశాస్త్రి - నండూరిలాంటి కవుల పాటలూ - పద్యాలూ అన్నీ వల్లించేస్తూ, సుగుణా ఆయన వంటిగా కలుసుకున్నప్పుడు అప్పజెప్పేస్తూండేవారట.

వారిద్దరూ విహంగాల్లాగ - స్వేచ్ఛగా ఎగిరిపోదామని-ప్రేమగాలిని పీలుస్తూ-ప్రేమలోనే బతుకుతూ వుందామనీ కలలు కంటూండేవారట. వీరి రోమాన్సు ప్యూన్ నుంచి, ప్రిన్సిపాల్ దాకా అందరికీ తెలిసిందే! ఈవార్త సుగుణ తండ్రికి తెలిసింది. అమ్మాయిని ఏ కలక్టరుకొడుక్కో యిద్దామనుకుంటే, కలక్టరాఫీసు హెడ్డుగుమాస్తా కొడుకుతో కూతురు ప్రేమకలాపాలు

ఆయనకు నచ్చలేదు. మెల్లిగా సంబంధాలు వెతికారు. అమ్మాయి చదువుని అక్కడికి కట్టబెట్టించి కలక్టరుగారి అబ్బాయికిచ్చి పెళ్లిచేశారు.

ఇంక మావారి అవస్థ చెప్పాలీ! చెట్లనీ-పిట్టల్నీ-కాలేజీ గోడల్నీ ఆఖరికి గేటు వాచర్నిగూడా అడిగేరట. "సుగుణ ఏది?" అని. ఏదేమిటి కలక్టరుగారి కోడలయింది; ఇంకో రెండేళ్ళలో ఆఫీసరుగారి భార్యగా కులుకుతూ వుంటుంది. అని చేతనాచేతనములన్నీ ఏకగ్రీవంగా చెప్పాయి.

సుబ్బారావుగారి ప్రేమ హృదయం చితికి సుగుణ వియోగాన్ని భరించలేక ఆత్మహత్యకు పరికరాల్ని కూర్చుకునే ప్రయత్నంలో వుండగా తండ్రివచ్చి కొడుకుని జాగ్రత్త చేసుకున్నాడు. ఒక ఏడంతా యింట్లో కూచున్న మావారు కొంచెం తమాయించుకు-తిరుగ చదువులో ప్రవేశించేందుకు వప్పుకున్నారు.

తరవాత ఎం. ఎ. పూర్తి అవటం, కాలేజీ జీవితంనాటి దుడుకుతనం-ప్రేమపైత్యం యిత్యాదులుతగ్గి నన్ను పెళ్ళాడటం జరిగింది.

పెళ్ళయిన కొత్తలోనే వారి ప్రేమానుభవాలు ఏకరువు పెట్టారు నాతో. కాని వాటిల్లో ప్రముఖపాత్రయిన సుగుణను మటుకు యీనాటిదాకా వారు తలుస్తూనే వుంటారు.

ఆ మధ్య గవర్నరు సన్మాన సందర్భంలో యీ సుగుణ నాట్యం చేసిందని పత్రికలో పడింది 'అలాంటి గొప్ప స్త్రీకి తను కొన్నాళ్ళన్నా ప్రియుణ్ణి అయ్యానని గర్వంగా వుంది' అనేవారు.

ఆయన సుగుణా తనూ ప్రేమించుకున్న దినాలను గురించి చెపుతూంటే ఆమో దేవతలూ-నేనో మానవాంగననూ-నా అదృష్టంకొద్దీ తనకు నేను భార్యనయ్యాను - అనే ధోరణిలో మాట్లాడుతుండేవారు. మొదట్లో నాకు ఉడుకుమోత్తనంగావున్నా రానురాను ఆ ధోరణి అలవాటైంది.

రాత్రి వారు యింటికొచ్చిన తరువాత తమ ఆరాధ్యదైవం-సుగుణాదేవిగారు విచ్చేశారని చెప్పాను. రాత్రి రెండు గంటలదాకా నన్ను నిద్దర పోనీలేదు. "ఎలానిల్చుంది? ఏ వైపు ముఖం తిప్పింది? ఎన్ని డిగ్రీల కోణంలో ముఖం ఉంచింది? చిరునవ్వులో పెదాలు సన్నగా వంగాయా? ఎంత లావుంది? నన్నుగురించి ఎన్నిసార్లు అడిగింది?" యిలా విసిగించి చంపారు.

మరుసటి ఆదివారం నేను సుగుణ యింటికి వెళ్ళేందుకు మొహమాట పడ్డాను. "అయినా వాళ్ళిద్దరూ ఎన్నాళ్ళ వియోగానంతరమో కలుసుకుంటున్నారు—మధ్య నేనెందుకు ?" అని వారిని పంపాను.

ఆ నాటి రాత్రి వారు వచ్చేదాకా నిద్రపోకుండా ఆత్రంగా కనిపెట్టుక్కూచున్నాను. పదింటికి వచ్చారు, ఇంక వచ్చింతరువాత మొదలెట్టారు. ఒకటే ధోరణి ! ఆవిడభర్త లేబర్ ఆఫీసరట. అడయారులో పెద్ద బంగాళా. సరే—కారు మాయింటికే వచ్చిందిగా ! భర్త ఆవిడకు సంపూర్ణస్వాతంత్ర్యం యిస్తాడుట. వీరు వెళ్ళే వేళకి ఆయన యింట్లోలేరు. రాత్రి పది దాటితే గాని రాడుట. చివరికి సుగుణాదేవి భర్తని మావారు చూడకుండానే వచ్చేశారు. ఎంతో ఆప్యాయంగా నవ్వుతూ కాలేజీరోజుల్లోలాగే మాట్లాడిందట. పిల్లలిద్దరిచేతా నాట్యం చేయించిందట. మేడమీద పెద్ద డ్రాయింగురూము, రేడియో, పెద్దపెద్ద సోఫాలు- కార్పెట్సు-ఇల్లు దేవేంద్రభవనంలా వుందట. "మీ ఆవిడ అంత ఫార్వర్డుగా వుండదా ?" అని అడిగిందట. ఈయనకి తల కొట్టేసినట్టయిందిట. నన్నుకూడా లేడీస్ క్లబ్ లో మెంబరు చేయిస్తానందిట. వచ్చేఆదివారం తప్పక మాయిద్దరినీ రమ్మనమని ఆహ్వానించింది. ఆనాడు ఆమెభర్త గూడా యింట్లో వుంటారని చెప్పింది. యాపిల్సుముక్కలు ఎంతో నాజూగ్గా తరిగిపెట్టిందిట. కత్తిపట్టుకున్న ఆమెవేళ్లు చూస్తే మావారికి వొళ్ళు జల్లుమన్నదిట. యిల్లా నడిచింది-ధోరణి.

మళ్ళీ ఆదివారం వచ్చేదాకా ప్రతిరోజూ మా యిద్దరికీ సుగుణ మాటలే ! విసుగెత్తి "నేను రాను. మీరుకావాలంటే వెళ్ళండి" అన్నాను. "నీకు ఆవిడనుచూస్తే జెలసీ" అని మొదలెట్టారు. ఎప్పుడూలేంది ఆనాడు నన్ను బీచికి వారంతటవారే తీసుకెళ్ళారు. సంభాషణ, నీరు పల్లమెరుగు—అన్నట్టు సుగుణవైపు తిరిగింది. 'ఆడవాళ్ళు సహజంగా తాము పొందలేనివి యితరులు పొందితే వోర్చలేరనీ—ఆఖరికి వాటిని పొందే మార్గమున్నా వెతకరనీ-సుగుణలాంటి విజ్ఞానవతుల స్నేహంవల్ల నాలోని సంకుచితాన్ని రూపుమాపుకోవాలనీ' నాకుపాఠం బోధించ మొదలుపెట్టారు. నే చదివిన ఇంగ్లీషు తెలుగు నవలల్లోని నాయికలు మిడిమిడి జ్ఞానంచేత భర్తకు సంపూర్ణ స్వాతంత్ర్యం యివ్వాలనీ-అప్పుడే దాంపత్యం ఆదర్శయుతంగా వుంటుందనీ చెప్తూవచ్చారు. నాచెయ్యి పైనవుండేందుకూ, నాది విశాల హృదయం అని

నిరూపించుకునేందుకూ మనసులో యిష్టంలేకపోయినా ఆదివారం యిద్దరం సుగుణగారింటికి బయలుదేరాం.

మేము అడుగుబెట్టేవేళకి సుగుణభర్త వొక్కరే డ్రాయింగురూములో వున్నారు.

మాకు మేము పరిచయం చేసుకున్నాము.

వారికి; సుగుణకూ మావారికీ మధ్య జరిగిన రాకపోకలు తెలియవని గ్రహించుకున్నాను. క్రిందికి భార్యకోసమై కబురంపారు. మనిషి నల్లగా పొడుగ్గా వున్నాడు. నిండైన విగ్రహం. అంతా బాగానే వుంది. గది నాలుగు మూలలా పరికాయించాను. విలువైన వస్తువులతో అలంకరించబడింది. ఇంతలోకే సుగుణ వచ్చారు. రెండుజడలు - పార్శీకట్టూ మనిషి మున్నటి కంటె యీనాడే బాగుంది. ప్రత్యేకాలంకారమా? మమ్మల్ని ఆ రాత్రి భోంచేయమని భార్యాభర్తలు బలవంత పెట్టారు తలవొగ్గాం. మాటల్లో అంతా చాలాఉత్సాహంగా పాల్గొన్నాం. సుగుణా మావారూ జీవిత పుస్తకాల్లోని పుటలు తిరగేస్తున్నారు.

సుగుణభర్త - రాజకీయాలు ఫిల్ములు- వార్తాపత్రికలు ఒకటేమిటి ప్రతివిషయం నాతో మాట్లాడారు ఆయన మాటకారి. మొదట్లోని భయం తగ్గి నా అభిప్రాయాలని ధైర్యంగా బయటపెట్టాను. ఆయనచాలామట్టుకు నాతో ఏకీభవించారు. రెండుగంటలు యిట్టే గడిచాయి.

క్రిందనుంచి భోజనాలకి పిలుపు వచ్చింది. అంతా మెట్లు దిగుతున్నాం ముందు మావారు, ఆపైన సుగుణ తర్వాత నేను-వెనక ఆఫీసరు. మెట్లు గుండ్రంగా వున్నాయి. సుగుణా మావారూ మెలిక తిరిగారు. రెండో మెట్టు దిగానో లేదో అంతవరకూ హుందాగా మాట్లాడుతున్న ఆఫీసరు నా చెంగు పుచ్చుకు లాగాడు. ముచ్చెమటలు పోశాయి. వొళ్ళుమండి ఆ చేత్తో ఆయన లెంపమీద ఒకటి వడ్డించి ఒక్కదూకుని మెట్లుదిగాను

మావారితో వెంటనే వెళ్ళాలని నిక్కచ్చిగా చెప్పాను. సుగుణ తెల్లబోయింది. ఆఫీసరుగారు మొహంచెల్లక క్రిందకురాలేదు. మావారు ధూములు ధూములతో బయటకు తీసుకొచ్చారు. బస్సువచ్చేలోపల జరిగినసంగతి వారికి చెప్పాను. మావారు వుగ్రులైపోయారు కక్కురుమంటే వొట్టు.

ఇది నాలుగేళ్ళక్రింద సంగతి. నే నెప్పుడన్నా సుగుణావాళ్ళమాట ఎత్తితే మావారు నిశ్శబ్దంగా నావంక చురచురా చూస్తారు. మళ్ళీ వాళ్ళ ఖబురు తెలియలేదు మాకు.